


# చిలకాగోరింక

"ఆ దంపతులిరువురూ చిలకా గోరింకల వలె అన్యోన్యంగా జీవితము గడిపిరి అని నా చిన్నతనంలో కాశీ మజిలీ కథల్లో చదివేను. పెద్దయ్యాక సాంఘిక నవలల్లో కూడా చిలకాగోరింకల్లా అన్యోన్యంగా గడిపిన భార్యాభర్తలు తటస్థపడ్డారు. సినిమాలలో సరేసరి. నీవే చిలుకయి నేనే గోరింకా అంటూ నాయకుడు ఊడలు పట్టుకొని ఊగుతూ రొమ్ములు విరుచుకోవటం చూసేను.

నాకు వివాహ జీవితం గురించి ఒక అభిప్రాయం అంటూ ఏర్పడ్డాక

ఏ కొమ్మమీదయినా అన్యోన్యంగా గడిపే చిలుకా గోరింకా కని పిస్తా యేమోనని తెగవెదికే వాడిని. కాని నా ఆశ నిరాశే అయింది.

ఒకసారి కాలేజీ వరండాలో రెండు పిచ్చుకలు కిచకిచమని శబ్దం చేస్తూ ఒకదాన్ని మరొకటి ముక్కులతో పొడుచుకుంటూ దగ్గరగా కలిసి రెండు క్షణాలుండి విడిపోయి ఎగిరిపోవటం చూసేను. "చూసేవా! అవి రెండూ ప్రేమించుకుంటున్నాయి" అన్నాడు ప్రక్కనే వున్న శ్రీనివాస మూర్తి అతడు ఫైనల్ బియ్యెస్సీ జూవాలజీలో చదివాడు అప్పటికి.

"అదేమిటి? అవి తన్నుకు చస్తూవుంటే ప్రేమించుకుంటున్నాయి అంటావేమిటి?" అన్నాను.

"అదంతే! పోట్లాట మధ్యనే ప్రేమ మరింత తియ్యగా వుంటుంది." అటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు అప్పటికే వివాహమయి పోయిన శ్రీనివాసమూర్తి నాకు అతని మాటలు నచ్చలేదు.

"తగవులాటల మధ్య ప్రేమ ఏమిటి? ఏగొడవాలేకుండా వుంటేనే అది అన్యోన్య దాంపత్యం" అనిపించింది. ఆ అభిప్రాయం తరువాత నా మనసులో గాఢంగా నాటుకుపోయింది.

కాలేజీలో చదువు పూర్తిచేసుకొని లెక్చరరుగా జీవితంలో స్థిర పడ్డాక అరు సంబంధాలు కాదని అఖరుకు సుశీలను చేసుకున్నాను.

ఆమె నాజీవితంలోకి ప్రవేశించేక అన్యోన్యతను గురించి నా అభిప్రాయం చాలావరకూ మార్చుకోవలసి వచ్చింది. కూర్లలో రుచుల నుండి పుస్తకాలు చదవటం లోని ఇష్టాలవరకూ అన్నిటిలోనూ మాకు చుక్కెదురే.

నా కోసం నువ్వు కొన్ని పద్ధతులు మార్చుకోవాలి" అన్నాను ఓ రోజు ఆమె వంటిట్లో కూర తరుగుతూ వుండగా.

ఆమె అప్పటికి అనపకాయ తరిగి రెండు ముక్కలు చెయ్య బోతోంది "ఇదిగో ఈ కాయను ఇలా నిలువుగా తరగటం నా పద్ధతి. మార్చుకోమంటే అడ్డంగా తరుగుతాను." అంటూ పకపకి నవ్వుతూ

కాయను అడ్డంగా రెండు ముక్కలుచేసి కత్తిపీటకు చెరో వైపూ చెరో ముక్కా పడేసింది.

తరువాత నా కళ్ళలోకి తియ్యగా చూసింది.

లాభంలేదు! సుశీలతో అన్యోన్యత పొసగని పని! చికాకుగా అక్కడ నుండి నా గదిలోకి వెళ్ళిపోయాను. మా ఇద్దరి మధ్యా నేను కలలు గన్న అన్యోన్యతను సాధించటానికి ప్రయత్నాలు మట్టుకు మాన లేదు. ఓరోజు రాత్రి డాబామీద వెన్నెల్లో పక్కలు పరచుకొని సుశీలను పొదివిపట్టుకొని "నాకు చందమామ అన్నా వెన్నెలన్నా ఎంత ఇష్టమో తెలుసా?" అన్నాను "నాకు ఇష్టంలేదు. బాబూ" అంది బుంగమూతి పెట్టి. "మరి నీకేమిటి ఇష్టం?" అన్నాను అసహనంగా.

"మీరంటే ఇష్టం అంది కిలకిలమంటూ.

నా మనసు పూల తెప్పలా ఆనందంతో తేలిపోయింది.

ఆమెను గాఢంగా హృదయాన్ని హత్తుకుంటూ "నేనంటే అంత ఇష్టం కదా నా అభిరుచులకు తగినట్లు నీ అభిప్రాయాలు ఎందుకు మార్చుకోవు?" అన్నాను.

"మీకోసం నా ఇష్టాలనూ, నా కోసం మీ యిష్టాలనూ ఎందుకు మార్చుకోవాలి? ఎవరి వ్యక్తిత్వం ఎవరి అలవాటు వాళ్ళవి. ఇందులో కొంపమునిగిపోయేది ఏముంది.

మీకు బెండకాయ కూర ఇష్టమనీ అదే తినమని కూడా బలవంతం చేయటంలో అర్థం లేదు. అబ్బ! జిగురుబాబూ!" అంటూ మూతి అదోలా బిగించింది.

నా ఉత్సాహం నీరుకారిపోయింది.

సుశీలకు ఎలా నచ్చచెప్పాలో నా కర్థంకాలేదు.

నా తపన నాలోనే మిగిలిపోయింది.

ముగ్గురు పిల్లలు పుట్టినా, మా మధ్య చిన్న చిన్న తగవులు సమసి పోలేదు. మాది అన్యోన్యదాంపత్యం కాదు. అలా అనుకొని నేను గర్వ

పడే రోజు ఎన్నటికీరాదు ఆరు సంవత్సరాలు ఈ సంఘర్షణ అనుభవిం చేక నా పరిసరాల్లో అన్యోన్యదంపదాలు ఎవరయినా కనబడతారేమోనని అన్వేషణ ఆరంభించేను. కాని నా కది అంత సులువయిన విషయంలా కనుపించలేదు. పైకి ఎంతో సోషల్‌గా మసలుతూ కేరింతలుకొడుతూ తిరుగుతూ కనుపించే దంపతుల "ఇంట్లో కథలు" విన్నాక నాకు మతిపోయి నట్లనిపించేది. ఏదో విషయంమీద పోట్లాడుకోకుండా జీవించేజంట నాకు తారసిల్లలేదు. నా అన్వేషణలో నేను కృతకృత్యుణ్ని కాలేనేమోననే అనుమానంకూడా వచ్చింది. అయితే నాఅనుమానాన్ని వమ్ముచేసింది ముకుంద మూర్తితో పరిచయం.

నేను "రెస్టురూమ్"లో కూర్చుని ఆవేళటి పాఠానికి "ప్రిపేర్ అవుతూ ఉంటే ప్రిన్సిపాల్‌గారు హడావుడిగా లోనికి వచ్చి "ఈయన పేరు ముకుందమూర్తి. కొత్తగా మన హిస్టరీ డిపార్టుమెంటుకు వచ్చేరు. ఈయన్ని అందరికూ పరిచయం చేయండి. నేను కమిటీ మీటింగుకు వెళ్ళాలి!" అంటూ నాకు అతన్ని పరిచయం చేసి హడావుడిగా వెళ్ళి పోయారు.

ముకుందమూర్తి రెండుచేతులూ జోడించి "నమస్కారం మేస్టారూ!" అన్నాడు.

"నమస్కారం. నాపేరు కృష్ణమూర్తి" అంటూ నన్ను నేను పరిచయం చేసుకొని "అలా కూర్చోండి" అంటూ కుర్చీ చూపించేను.

ముకుందమూర్తి స్ఫురద్రూపి. ఒకసారి చూసినవాళ్ళు ఆ ముఖాన్ని మరచిపోలేరు. చక్కని కంఠం. మాట్లాడుతూవుంటే సంస్కారం వుట్టిపడుతూ ఉంటుంది. ఒకగంట సాహచర్యంతోనే అతడు నన్ను ఆకర్షించేడు. మిగిలినవారందరికీ అతన్ని నేను పరిచయం చేశాను. రెండురోజుల తరువాత అతడు నన్ను వాళ్ళింటికి "టీ"కి ఆహ్వానించేడు. నేనూ మా ఆవిడా కలసి వాళ్ళింటికి వెళ్ళాం. అపుడు ముకుందమూర్తి భార్యను చూసేను. ఆమె పేరు హేమసుందరి. నిజంగా హేమసుందరిలాగే వుంది.

విశాలమయిన కళ్ళు, వినమ్రతతో కూడిన ప్రవర్తన నన్ను ఆశ్చర్య చకితుణ్ని చేశాయి. మా ఆవిడకూడా హేమసుందరి కలుపుగోలుతనానికి ఎంతో ఆనందపడింది. నాలుగయిదు వారాల పరిచయంతో మా రెండు కుటుంబాలు చాలా సన్నిహితమయ్యాయి.

ముకుందమూర్తి, హేమసుందరిలది చక్కని దాంపత్యం. వాళ్ళిద్దరూ మాట మాత్రానికయినా పోట్లాడుకోటం, దెబ్బలాడుకోటం నేను చూడలేదు. ఒకరి అభిప్రాయాలకు మరొకరు ఎంతో విలువనిస్తూండేవారు. ఎంత చిన్న విషయమయినా ఇద్దరూ సంప్రదించి మరీ ఒకనిర్ణయం తీసుకునేవారు. అతని బట్టలన్నీ హేమసుందరి కొనేది. ఆమెచీరలన్నీ ఆతను సెలెక్టు చేసేవాడు. ఏ విషయంలో చూసినా వారిద్దరిమధ్యా ఏ రకమయిన పెత్తి నాకు కనబడలేదు. వీటన్నిటికీమించి వాళ్ళిద్దరూ తగవులాడుకోటం నేనెన్నడూ చూడలేదు.

"తగవులాటలు లేని దంపతులే వుండరంటావు నువ్వు! మూర్తీ, సుందరీ చూడు. ఎంత అన్యోన్యంగా ఉంటారో! అన్యోన్యదాంపత్యమంటే వాళ్ళదీ" అన్నాను ఒకదినం సుశీలతో.

సుశీల తేలిగ్గా నవ్వేసింది.

"పెళ్ళయిన కొత్తలో మనమూ ఉండేవాళ్ళం. నా కొంగు వదిలేవారేమిటి మీరు? నాలుగు రోజులకి పెళ్ళాం పాతబడుతుంది. అప్పుడు ఈ పూసుకు తిరగడాలు తగ్గుతాయి. కడుపున ఓ కాయకాస్తే ఆడదానికి పిల్లల పెంపకంవేపు కొంత శ్రద్ధ మళ్ళుతుంది. అందుకని మొగుడిమీద అభిమానం తగ్గిపోయిందనుకుంటే ఎలాగ? సంసారమన్నాక అభిప్రాయ భేదాలు, చిన్నచిన్న తగవులాటలు రాకుండా ఎలా వుంటాయి? తగువులు లేని దాంపత్యముంటే ఆ దాంపత్యం నాకొద్దు! అలా వుండటం నా వల్ల కాదు. ఎప్పుడూ పంచదార చప్పరిస్తూ కూర్చుంటే దాని తీపి ఏం తెలుస్తుంది? ఓ మిరపకాయ నమిలేక, కళ్ళనీళ్ళు తిరుగుతూవుంటే నోట్లో చారెడు పంచదార పోసుకుంటే అపుడు దాని అసలు రుచి తెలుస్తుంది

అలా అని రోజూమిరపకాయలు నమలమని నేను చెప్పటంలేదు." అంటూ ఉపన్యాసందంచి వంటింట్లోకి చక్కాబోయింది.

ఏది ఏమయినా వాళ్ళతో పరిచయం కలిగేక నాకు జీవితంలో ఏదో తృప్తి ఏర్పడినట్లనిపించింది. వాళ్ళిద్దరూ అలా వుండటం నిజంగాగొప్పే! అయితే వాళ్ళు నలుగురి మధ్యలోనూ అన్యోన్యంగా ప్రవర్తిస్తూ విడిగా ఉన్నప్పుడు దెబ్బలాడుకుంటున్నారేమో అన్న అనుమానంకూడా నాకు కలుగకపోలేదు. అందుకే అప్పలమ్మను ఈ విషయం గురించి కదిపి చూసేను. అప్పలమ్మ మా రెండిళ్ళకూ పనిమనిషి. "ఆ మూర్తి పెళ్లాన్ని ఎప్పుడూ కొడుతూవుంటాడు కదూ!" అన్నాను ఓసారి. అప్పలమ్మ రెండు చేతులూ నోటిమీద వేసుకొని నొక్కుకొంటూ "అయమ్మని మహారాణిలా చూసుకుంటాడు. ఆ బాబూ అళ్ళ అంటే పాపానికిపోతారు" అంటూ నామీద విరుచుకుపడినంత పనిచేసింది. వాళ్ళిద్దరి గురించీ వేరుగా ఆలోచించటానికి నాకు ఏ అవకాశమూ దొరకలేదు.

ఇంతలో నేను ట్రయినింగు నిమిత్తం గుంటూరు వెళ్ళాల్సి వచ్చినది. పిల్లల్ని వూళ్ళో వున్న మామగారింట్లో వదిలి సుశీలతో సహా గుంటూరు వెళ్ళాను. పని ఒత్తిడిలో ట్రయినింగు 4 నెలలూ, 4 వారాల్లో గడిచిపోయాయి. తిరిగి వచ్చి స్కూల్లో చేరిన మొదటిదినాన్నే ముకుంద మూర్తికోసం వెదికాను. అతనెక్కడా కనబడలేదు. తెలుగు లెక్చరరు సోమసుందరాన్ని అడిగితే "ముకుందమూర్తి ఈ మధ్య సెలవుల్లో వున్నాడు. భార్యతో గొడవలు వచ్చేక కాలేజీకి సరిగ్గా రావటం లేదు." అన్నాడు.

"ఏమిటి? భార్యతో గొడవలా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును! ఈమధ్యనే అతని పెళ్ళి అయిందికదా! పెళ్ళితో గొడవలు ప్రారంభమయ్యేయి."

నాకు మతి పోయినట్లయింది.

"ఈమధ్య పెళ్ళి చేసుకోడమేమిటి? హేమసుందరి ఏమయింది?" అన్నాను.

"అదేనయ్యా బాబూ! హేమసుందరిని ఈ మధ్యనే పెళ్ళి చేసుకున్నాడు. నీకీ గొడవంతా తెలీదుకాబోలు! హేమసుందరి అతని పెళ్ళాం కాదు. విశాఖపట్నంనుండి ఆ అమ్మాయిని లేపుకొచ్చి కాపరం పెట్టాడు. అయితే ఈ సంగతి రెండునెలల క్రితం బయటపడింది. వాళ్ళిద్దరి పేర్లూ ఊరిగోడలమీద కెక్కాయి. ప్రిన్సిపాల్ అతన్ని పిలిచి ఇది కాలేజీ గౌరవానికి సంబంధించిన విషయం కనుక వెంటనే ఆమెను నలుగురి సమక్షంలోనూ పెళ్ళిచేసుకొమన్నాడు. లేదా ఉద్యోగాన్కి రాజీనామా చేయాల్సి వస్తుందని బెదిరించేడు. అప్పుడు మనవాడు ఆ పిల్లని పెళ్ళాడేడు."

నేను నోరు తెరుచుకుని సోమసుందరం చెప్పేది వింటూ వుండిపోయాను.

నాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

కొంతసేపు అయ్యాక తేరుకొని "తర్వాత?" అన్నాను.

ఏముంది? తరువాత కథ మామూలే! పెళ్ళయ్యాక పెళ్ళాం మీద పెత్తనం చెలాయించటం ఆరంభించేడు. ఆ అమ్మాయికి నచ్చలేదు కాబోలు! చిలికి చిలికి గాలివానలయ్యేయి. పదిహేను దినాల క్రితం ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగి ఆఖరికి చేతులు చేసుకోడం వరకూ వచ్చిందట! ఆ అమ్మాయి రాత్రికి రాత్రి మరో ఇంటికి వెళ్ళిపోయింది మొగుణ్ణి వదిలి. ప్రస్తుతం ఇద్దరూ వేరే వుంటున్నారు." సోమసుందరం మాటలు వింటూ కుర్చీలో కూలబడిపోయాను. నా ఊహల్లోని అన్యోన్య దాంపత్యపు అందాలహర్మ్యం పేలి ముక్కలయిపోయింది. అందులో చెరోమూల గదిలోనూ నిలబడి ముకుందమూర్తి, హేమసుందరి నా కేసి ఎగతాళిగా నవ్వుతున్నట్లనిపించింది.

*

ఆంధ్రభూమి [17-11-77]